సాక్షి ప్రకాశం

శనివారం । 18 । జనవరి । 2025

I



ఐఆర్ ఇవ్వకుంటే ఉద్యమమే

ఉద్యోగుల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఐఆర్ ఇవ్వకుంటే ఉద్యమిస్తామని మాజీ ఎమ్మెల్సీ నరసింహారెడ్డి, ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రఘునాథరెడ్డి ధ్వజమెత్తారు. - IIలో..



యువకుడు అనుమానాస్పద మృతి

ఓ యువకుడు తాను ప్రేమించిన యువతి ఇంటిపైనే అనుమానాస్పదస్థితిలో మృతిచెందిన సంఘటన కురిచేడులో జరిగింది. - IIలో..

గరిష్టం/కనిష్టం
30/22

వాతావరణం

పొగమంచు కురుస్తుంది.
చలిగాలులు వీస్తాయి.
ఆకాశం మేఘావృతమై ఉంటుంది.

న్యూస్‌రీల్

నేడు నవోదయలో 6వ తరగతి ప్రవేశ పరీక్ష

ఒంగోలు సిటీ: జవహర్ నవోదయ విద్యాలయం ఒంగోలులో 2025–26 విద్యా సంవత్సరంలో 6వ తరగతిలో ప్రవేశించేందుకు ఈ నెల 18వ తేదీ ఉదయం 11 గంటలకు 25 సెంటర్లలో ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు డీఈఓ అత్తోట కిరణ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షకు 5,484 మంది హాజరుకానున్నట్లు చెప్పారు. విద్యార్థులు హాల్‌టికెట్లు తీసుకుని వారికి కేటాయించిన సెంటర్‌లో పరీక్షకు హాజరుకావాలని సూచించారు.

పశు ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

● కలెక్టర్ తమీమ్ అన్సారియా



పశు ఆరోగ్య శిబిరాల పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు అర్బన్: జిల్లాలోని గ్రామాల్లో ఈ నెల 20 నుంచి 31వ తేదీ వరకు నిర్వహించనున్న పశు ఆరోగ్య శిబిరాలను పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా కోరారు. శిబిరాలపై పశుసంవర్ధకశాఖ రూపొందించిన అవగాహన పోస్టర్లను స్థానిక ప్రకాశం భవనంలో శుక్రవారం కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ శిబిరాల్లో పశువులు, దూడలు, గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు వేయనున్నట్లు వెల్లడించారు. తెల్ల పశువులకు ముద్దచర్మ వ్యాధి నివారణ టీకాలు, అన్ని పశువులకు గొంతువాపు వ్యాధి నివారణ టీకాలు వేయనున్నట్లు చెప్పారు. ప్రతి మండలంలో రోజుకు రెండు గ్రామాల చొప్పున ఈ శిబిరాలు నిర్వహించేలా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖాధికారి బేబీ రాణి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

అమిత్ షా గో బ్యాక్

● అమిత్ షా రాకను వ్యతిరేకిస్తూ నిరసనలు తెలపాలని వామపక్షాల పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న వామపక్షాల నాయకులు

ఒంగోలు టౌన్: రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేడ్కర్ గురించి పార్లమెంటు సాక్షిగా అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా రాష్ట్ర పర్యటనను వ్యతిరేకిస్తూ ఈ నెల 19వ తేదీ నిరసన కార్యక్రమాలు చేపట్టాలని వామపక్ష పార్టీలు ప్రజలకు పిలుపునిచ్చాయి. శుక్రవారం స్థానిక మల్లయ్య లింగం భవనంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ మాట్లాడుతూ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగానికి బదులుగా ఆర్‌ఎస్‌ఎస్ రాజ్యాంగాన్ని అమలు చేసేందుకు బీజేపీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. అందులో భాగంగానే అమిత్ షా సాక్షాత్తూ పార్లమెంటులో అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారని చెప్పారు. రాష్ట్రానికి అమిత్ షా రాకను వ్యతిరేకిస్తూ వామపక్షాల ఆధ్వర్యంలో నిర్వహించే నిరసన కార్యక్రమాల్లో ప్రజలు విరివిగా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ఎస్‌కే మాబు, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకుడు చిట్టిపాటి వెంకటేశ్వర్లు, జిల్లా నాయకురాలు లలితకుమారి పాల్గొన్నారు.

నేటి నుంచి ఎన్టీఆర్ కళాపరిషత్ వారోత్సవాలు

ఒంగోలు మెట్రో: ఎన్టీఆర్ కళాపరిషత్ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం నుంచి వారోత్సవాలు మొదలవుతాయని కళా పరిషత్ అధ్యక్షుడు ఈదర హరిబాబు తెలిపారు. శుక్రవారం సాయంత్రం స్థానిక పీవీఆర్ బాలుర హైస్కూల్ గ్రౌండ్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. వారోత్సవాల వివరాలను వెల్లడించారు. నాటక రంగ అభిమానులంతా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

బరి తెగించి.. జేబులు దోచి..!

బరుల్లో కోడిపుంజులు పందేనికి కాలు దువ్వుతుంటే.. పందెం రాయుళ్లు ఢీ అంటే ఢీ అంటూ రూ.కోట్లలో డబ్బులు బెట్టింగ్ కట్టి చేతులు కాల్చుకున్నారు. పండుగ మూడు రోజులు కోళ్ల కత్తులు దూస్తే.. కోట్లలో పందేలు సాగాయి. ఈ మాయదారి జూదంలో కొందరు షరాబులు కాగా..మరెందరో గరీబులుగా మారిపోయారు. సంప్రదాయం పేరుతో సాగిన ఈ జూద క్రీడలో నిమిషాల్లో లక్షల రూపాయలు చేతులు మారిపోయాయి. అధికార పార్టీ నేతలు, నిర్వాహకులు జేబులు నింపుకోగా, అనునిత్యం కాయకష్టం చేసి సంపాదించిన సొమ్మును కోడి పందేలకు పెట్టి పెద్ద మొత్తంలో డబ్బు పోగొట్టుకుని అప్పులపాలై ఉసూరుమంటూ తిరిగి ఇంటికి చేరుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా అధికార యంత్రాంగం చూసీచూడనట్టు వ్యవహరించిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లాలో ప్రధానంగా ఒంగోలు, సంతనూతలపాడు, కొండపి నియోజకవర్గాల్లో పెద్ద ఎత్తున కోడి పందేలు నిర్వహించారు.

● పేదల జీవితాల్లో చీకట్లు నింపిన కోడిపందేలు
● అధికార పార్టీ నేతల అండదండలతో బరులు
● ఒంగోలు, సంతనూతలపాడు, కొండపి నియోజకవర్గాల్లో జోరుగా కోడి పందేలు
● చేతులు మారిన రూ.12 కోట్లు
● మామూళ్ల మత్తులో అధికారులు



సాక్షి ప్రతినిధి, ఒంగోలు:

సంక్రాంతి సందడిలో కోడిపందేల జూదం పేదల జీవితాలలో చీకట్లు నింపింది. హైదరాబాద్, బెంగళూరు, తదితర సుదూర ప్రాంతాల్లో బిల్డర్లుగా, మరికొంతమంది బేల్దారీ పనులు చేసుకుంటూ ఏడాది పొడవునా కాయకష్టం చేసి సంపాదించిన డబ్బుతో సంక్రాంతి పండుగకు సొంతూళ్లకొచ్చారు. సంపాదించిన సొమ్మును ఒక్క రోజులో కోడిపందేల్లో పాల్గొన్ని పోగొట్టుకున్న సంఘటనలు వారి కుటుంబాలలో ఆవేదన మిగిల్చాయి. స్థానికంగానే ఉంటూ ఖరీఫ్ సీజన్‌లో వ్యవసాయ పనులు, దుక్కి దున్నేందుకు, ఎరువులు, విత్తనాలు, కూలీల ఖర్చులకు దాచిన డబ్బులు కాస్తా కోడిపందేల్లో పెట్టి ఇంకొందరు నష్టపోయారు. జిల్లాలో కొండపి నియోజకవర్గంలోని ఆరు మండలాలతో పాటు ఒంగోలు నియోజకవర్గంలోని కొత్తపట్నం మండలం గమళ్లపాలెం, సంనూతలపాడు మండలంలోని వడ్డిపాలెం, ముగ్గువాగు ప్రాంతాలలో సంక్రాంతి పండుగ సందర్భంగా అధికార పార్టీ స్థానిక నాయకులు ప్రభుత్వ అండదండలతో కోడిపందేలు నిర్వహించారు. ఈ జూదంలో సుమారు రూ.12 కోట్లు చేతులు మారినట్టు అంచనా.

కొండపి నియోజకవర్గంలో రూ.7 కోట్లు...

కొండపి నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో సుమారు 7 కోట్ల రూపాయల కోడిపందేలు జరిగినట్లు అంచనా. పందెం బరులను అధికార టీడీపీ నేతలు దగ్గరుండి మరీ ఆడించినట్లు ఆరోపణలు ఉన్నాయి. సింగరాయకొండ మండలంలో సుమారు రూ.2 కోట్ల పందేలు జరగ్గా, దాదాపు 150 మంది వరకు పాల్గొన్నారు. రూ.10 వేల నుంచి లక్ష రూపాయల వరకు సొమ్ములు పోగొట్టుకున్నారు. ఈసారి మొదటిసారిగా పాతసింగరాయకొండ పంచాయతీలోని అయ్యప్పనగర్‌లో షామియానాలు వేసి మరీ కోడి పందేలు నిర్వహించారు. టంగుటూరు మండలంలోని కొణిజేడు, తదితర ప్రాంతాలలో సుమారు రూ.2.50 కోట్ల వరకు పందేలు జరిగాయి. పొన్నలూరు మండలంలోని కె.అగ్రహారం, మాలపాడు, చెన్నిపాడు, తదితర గ్రామాల్లో సుమారు కోటి రూపాయల వరకు, కొండపి, జరుగుమల్లి మండలాల్లో ఎడ్లూరుపాడు, కట్టావారిపాలెంలో సుమారు రూ.50 లక్షల వరకు, మర్రిపూడి మండలంలో సుమారు కోటి రూపాయల వరకు కోడిపందేలు జరిగినట్లు తెలుస్తోంది. మొత్తం మీద నియోజకవర్గంలో సుమారు వెయ్యి మంది వరకు డబ్బు పోగొట్టుకున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు.

చీమకుర్తి, ఎస్ఎన్ పాడులో రూ.4 కోట్లు..

చీమకుర్తి, సంతనూతలపాడు మండలాల్లో జోరుగా కోడి పందేలు జరిగాయి. చీమకుర్తి మండలం తొర్రగుడిపాడు, ఎర్రగుడిపాడుల్లో సంక్రాంతి రోజే రూ.కోటి మేర పందేలు జరిగినట్లు అంచనా. సంతనూతలపాడు మండలంలోని వడ్డిపాలెం శివారులో నిర్వహించిన కోడిపందేల్లో దాదాపు రూ.3 కోట్లు చేతులు మారి ఉంటాయని అంచనా. ఒక్కో జత కోడిపుంజుల మీద రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు కూడా పందేలు కాసినట్లు అంచనా. చిన్నాచితకా పందెపురాయుళ్లు రూ.5 వేల నుంచి రూ.50 వేల మధ్య పందేలు కాశారు. సంతనూతలపాడు మండల కేంద్రానికి దగ్గరగా ఉన్న పలు గ్రామాలతో పాటు కొండపి, చీమకుర్తి మండలాలకు చెందిన పలు గ్రామాల నుంచి కోడిపుంజులతో వచ్చేవారు కొందరైతే, పై పందేలు కాసేందుకు వచ్చేవారు మరికొందరు. ఇదిలా ఉంటే.. కోడిపందేలు చూసేందుకు వచ్చేవారు కొంతమంది కాగా, కోడిపందేలలో చనిపోయిన కోళ్లను మాంసం కోసం కొనుగోలు చేసేందుకు వచ్చే వారు మరికొందరు. కోడిపందేలలో నేరుగా పాల్గొన్న వారు, పై పందేల రూపంలో పందేలు కాసిన వారిలో ఎక్కువ భాగం హైదరాబాద్, బెంగళూరు నుంచి వచ్చిన బేల్దారులు, బిల్డర్లు ఉన్నారు. గ్రామాలలోని చిన్న, సన్నకారు వ్యవసాయ పనులు చేసుకునే రైతులతో పాటు కోడిపందేల వ్యసనానికి బానిసైన వారు కూడా ఉన్నారు. ఏడాది పొడవునా సంపాదించిన డబ్బును కోడిపందేల జూదంలో పోగొట్టుకోవడంతో వారి కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ వ్యవసనాలకు బలైన ఎంతో మంది జీవితాలలో ఈ సంక్రాంతి చీకట్లు నింపుతుందని వారి కుటుంబ సభ్యులు వాపోతున్నారు.



సంతనూతలపాడులోని ముగ్గు వాగు వద్ద సంక్రాంతికి కోడిపందేలు వేస్తున్న జూదరులు

గమళ్లపాలెంలో..

కొత్తపట్నం మండలానికి 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న గమళ్లపాలెంలో అధికార పార్టీ నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించిన కోడిపందేలకు ఒంగోలు, కొప్పోలు, అల్లూరు, ఆలూరు పరిసర ప్రాంతాల నుంచి వందలాది మంది పందెపు కోడిపుంజులతో పందేలకు సై అన్నారు. రూ.25 వేల నుంచి రూ.50 వేల వరకు పందెం కాశారు. మూడు రోజుల పాటు దాదాపు 150 జతల కోడిపుంజులు వచ్చినట్లు అంచనా. దాదాపు రూ.50 లక్షలు చేతులు మారినట్లు పందెపురాయుళ్ల లెక్కలు కడుతున్నారు. అంతేకాకుండా పందేలు చూసేందుకు వచ్చిన వారు సైతం ఏ కోడి గెలుస్తుందో అంటూ పై పందేలు కాశారు. ఇలాంటి వారి సంఖ్య సైతం ఎక్కువగానే ఉన్నట్లు తెలుస్తోంది. రూ.5 వేల నుంచి రూ.20 వేల మధ్య పందెం వేసినట్టు సమాచారం. దీనికి సంబంధించి మరో రూ.25 లక్షలు నష్టపోయి ఉంటారని అంచనా.

మామూళ్ల మత్తులో పోలీసులు...

సరదాగా సంక్రాంతి పండుగకు కుర్రాళ్లు కోడి పందేలు వేసుకుంటారు.. కాస్త పర్మిషన్ ఇచ్చి చూసీచూడనట్లుగా పోండని అధికార పార్టీ స్థానిక నాయకులు పోలీసులకు చెప్పడంతో.. పోలీసులు మరి మా సంగతేంటంటూ బేల చూపులు చూశారు. దాంతో పోటీలు నిర్వహించే నాయకులు తిలా పాపం తలా పిడికెడు అన్న సామెతలా తలా కాస్త వేసి పోలీసులను సంతృప్తి పరిచారు. దీంతో పోలీసులు కూడా కోడిపందేలకు వారి వంతు సహకారం అందిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నా.. ఆ విషయం జిల్లా పోలీస్ యంత్రాంగానికి తెలుస్తున్నా ఏమీపట్టనట్లు వ్యవహరించారు. మామూళ్ల మత్తులో జోగుతూ చట్ట వ్యతిరేక కార్యకలాపాలను ప్రోత్సహిస్తున్న పోలీసుల తీరును ప్రజలు తీవ్రంగా విమర్శిస్తున్నారు.

మొదటి జీతమే చివరి జీతమై..

పవన్‌కుమార్ మృతదేహం లభ్యం

● పాకల తీరంలో గల్లంతవగా, చెల్లెమ్మగారిపట్టపుపాలెం తీరానికి చేరిన మృతదేహం
● మిన్నంటిన కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలు
● పోస్టుమార్టం కోసం కందుకూరు ఏరియా ఆస్పత్రికి మృతదేహం తరలింపు



పవన్‌కుమార్ మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు, పరిశీలిస్తున్న సీఐ హజరత్తయ్య, (ఇన్‌సెట్‌లో) పవన్‌కుమార్ (ఫైల్)

సింగరాయకొండ: మండలంలోని పాకల బీచ్‌లో సముద్రస్నానం చేస్తూ కడ్సల కారణంగా గురువారం గల్లంతైన వారిలో తమ్మిశెట్టి పవన్‌కుమార్ (22) మృతదేహం శుక్రవారం మధ్యాహ్నానికి పాకల పంచాయతీ చెల్లెమ్మగారిపట్టపుపాలెం వద్ద ఒడ్డుకు చేరింది. మొత్తం ఐదుగురు గల్లంతవగా, ముగ్గురి మృతదేహాలు గురువారమే లభించాయి. ఒకరిని కాపాడారు. పవన్‌కుమార్ ఆచూకీ లభించకపోవడంతో శుక్రవారం గాలించి మృతదేహాన్ని గుర్తించారు. ఆ సమాచారం అందుకున్న సీఐ సీహెచ్ హజరత్తయ్య, ఎస్సై బి.మహేంద్ర, జరుగుమల్లి ఎస్సై బి.మహేంద్ర, రామాయపట్నం మెరైన్ ఎస్సై షేక్ మస్తాన్ షరీఫ్‌లు మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కందుకూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనకు సంబంధించి కేసు రిజిష్టరు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ హజరత్తయ్య తెలిపారు.

పవన్‌కుమార్ కోసం రాత్రంతా పడిగాపులు...

పాకల తీరంలో గల్లంతైన పవన్‌కుమార్ ఆచూకీ కోసం అతని తల్లిదండ్రులు అంకమ్మరావు, అంకమ్మ, సోదరి వెంకట లావణ్య రాత్రంతా అక్కడే పడిగాపులు కాశారు. చలిగాలులను సైతం లెక్కచేయకుండా అలాగే ఉండిపోయారు. చేతికంది వచ్చిన ఒక్కగానొక్క కొడుకు తమను విడిచి వెళ్లాడని తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. అక్క లావణ్య ఆక్రందనలు చూపరులను కలచివేశాయి. ఎస్పీ ఏఆర్ దామోదర్, మంత్రి స్వామి ఆదేశాలతో గురువారం సాయంత్రం ప్రత్యేక బోట్లలో పవన్‌కుమార్ కోసం గాలింపు చర్యలు చేపట్టినప్పటికీ ఫలితం లేకుండాపోయింది. దీంతో శుక్రవారం ఉదయం సీఐ హజరత్తయ్య, ఎస్సై మహేంద్ర, తహసీల్దార్ టి.రవి తీరానికి వెళ్లి మూడు బోట్ల ద్వారా గాలింపు చర్యలు చేపట్టేలా చర్యలు తీసుకున్నారు. చివరికి మధ్యాహ్న సమయంలో చెల్లెమ్మగారి పట్టపుపాలెం వద్ద తీరానికి మృతదేహం చేరింది. కుమారుని మృతదేహం చూడగానే ఒక్క ఉదుటున తల్లిదండ్రులు, అక్క చుట్టూ చేరి పవన్ లేవరా అంటూ రోదించడం తీరంలో విషాదం నింపింది. కడ్సలో చిక్కుకున్న తర్వాత బయటకు రావాలంటే ఒక్కోసారి వారం రోజులు కూడా పడుతుందని, ఈసారి తర్వాత రోజు మధ్యాహ్నానికే మృతదేహం బయటకు వచ్చిందని మత్స్యకారులు తెలిపారు.

ఇటీవలే ఉద్యోగంలో చేరి..

అల్లారుముద్దుగా పెంచిపెద్దచేసిన ఒక్కగానొక్క కొడుకు డిగ్రీ పూర్తి చేసి హైదరాబాద్‌లో ఉద్యోగ ప్రయత్నంలో ఉన్నాడని పవన్‌కుమార్ తండ్రి అంకమ్మరావు తెలిపారు. తన కూతురు హైదరాబాద్‌లోనే సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తోందని చెప్పారు. తన అక్కతో పాటే పవన్‌కుమార్ ఉంటున్నాడని తెలిపారు. ఇటీవల అమెజాన్‌లో డెలివరీ బాయ్‌గా చేరాడని, ఈ పండక్కి వచ్చేటప్పుడు మొదటి నెల జీతం తీసుకొచ్చి ఇచ్చాడన్నారు. తన కొడుకు ఇచ్చిన మొదటి జీతమే చివరి జీతమైందంటూ భోరున విలపించారు. తన కొడుకు లేడన్న వార్త తట్టుకోలేకపోతున్నానని అంకమ్మరావు చేసిన ఆక్రందనలు చూపరులకు సైతం కంటతడి పెట్టించాయి.

కుష్టు వ్యాధి రహిత జిల్లాగా మార్చాలి

● కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు అర్బన్: జిల్లాను కుష్టువ్యాధి రహితంగా మార్చేందుకు అధికారులు కృషి చేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. అందుకోసం ప్రజలకు విస్తృతమైన అవగాహన కల్పించాలని సూచించారు. కుష్టు వ్యాధి నివారణపై జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశాన్ని శుక్రవారం స్థానిక ప్రకాశం భవనంలో నిర్వహించారు. తొలుత డీఎంహెచ్ఓ వెంకటేశ్వర్లు జిల్లాలో కుష్టు వ్యాధి పరిస్థితులను వివరించారు. ప్రతి ఆరు నెలలకు ఒకసారి కుష్టువ్యాధి నిర్ధారణ కోసం ప్రత్యేక అవగాహన, ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గతేడాది నవంబర్ నెలాఖరు వరకు జిల్లాలో మొత్తం 91 కేసులు ఉన్నట్లు గుర్తించామన్నారు. జాతీయ కుష్టువ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఈ నెల 20 నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు. ఆశాలతో పాటు మరో పురుష ఫీల్డ్ లెవల్ వర్కర్ ప్రతి ఇంటికి వెళ్లి పరీక్షలు, ప్రచారం చేస్తారన్నారు. ఆరోగ్య కార్యకర్తలు ఇంటికి వచ్చినప్పుడు చర్మంపై స్పర్శలేని మచ్చలు, బొడిపెలు, కనుబొమ్మలు, కనురెప్పల వెంట్రుకలు రాలిపోవడం ఇతర లక్షణాలుంటే ప్రజలు పరీక్ష చేయించుకోవాల్సి ఉంటుందన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ అనుమానిత కేసులను గుర్తించి వెంటనే చికిత్స ప్రారంభించాలన్నారు. ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు కుష్టు వ్యాధి నివారణకు సంబంధిత అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. కార్యక్రమానికి సంబంధించిన అవగాహన పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా కుష్టు వ్యాధి నిర్మూలన అధికారి సురేష్‌కుమార్, డీసీహెచ్ఎస్ సూరిబాబు, డీఈఓ కిరణ్‌కుమార్, డీపీఓ వెంకటనాయుడు, జెడ్పీ సీఈఓ చిరంజీవి, సాంఘిక సంక్షేమ అధికారి లక్ష్మానాయక్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



కుష్టువ్యాధిపై సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

పీఎం జన్‌మన్‌ను పక్కాగా అమలు చేయాలి

గిరిజనుల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధాన మంత్రి జనజాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ (పీఎం జన్‌మన్) పథకాన్ని జిల్లాలో పక్కాగా అమలుచేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. శుక్రవారం ప్రకాశం భవనంలో పీఎం జన్‌మన్ కార్యక్రమం అమలుపై గృహ నిర్మాణం, పంచాయతీరాజ్, వైద్యారోగ్యం, విద్య, నీటి సరఫరా, స్త్రీ శిశుసంక్షేమం తదితర శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. అధికారులంతా సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. గిరిజనులు, చెంచుల అభివృద్ధే లక్ష్యంగా వారు నివసిస్తున్న ప్రాంతాల్లో సురక్షితమైన గృహాలు, స్వచ్ఛమైన తాగునీరు, మెరుగైన ఆరోగ్య సంరక్షణ, విద్య, పోషకాహారం, కమ్యూనికేషన్‌తో పాటు స్థిరమైన జీవనోపాధి అవకాశాలకు సంబంధించి 11 ఇండికేటర్లను కేంద్ర ప్రభుత్వం నిర్దేశించినట్లు తెలిపారు. వాటి కింద మంజూరైన పనులను సంబంధిత శాఖల అధికారులు సమీక్షించుకుంటూ గిరిజనుల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా కృషి చేయాలన్నారు. సమావేశంలో డీఎఫ్ఓ సందీప్ కృపాకర్, ఐటీడీఏ పీఓ వెంకట శివప్రసాద్, హౌసింగ్ పీడీ శ్రీనివాసప్రసాద్, ఐసీడీఎస్ పీడీ హేనసుజన, డీఈఓ కిరణ్‌కుమార్, డీఎంహెచ్ఓ వెంకటేశ్వర్లు, పశుసంవర్ధకశాఖ జేడీ బేబీరాణి, వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాసరావు, సీపీడీసీఎల్ ఎస్ఈ వెంకటేశ్వర్లు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ బాలశంకరరావు, టూరిజం అధికారి బెన్హర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రీ సర్వేపై ప్రజలకు అవగాహన కల్పించాలి

● జిల్లా జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ

ఒంగోలు అర్బన్: రీ సర్వేపై గ్రామ స్థాయిలో ప్రజలు, రైతులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక ప్రకాశం భవనంలోని గ్రీవెన్స్ హాలులో రీ సర్వేపై సమావేశం నిర్వహించారు. మండలానికి ఒక గ్రామం చొప్పున రీ సర్వే చేసేందుకు దిశానిర్దేశం చేశారు. గ్రామ సర్వేయర్లు, వీఆర్‌ఓలు, గ్రామ రెవెన్యూ సహాయకులు సర్వే జరిగే గ్రామంలోని భూ యజమానులందరికీ అదే గ్రామంలో నివాసం ఉంటున్న వారితో పాటు పక్క ఊర్లు, జిల్లాలు, రాష్ట్రాలు, ఇతర దేశాల్లో ఉంటున్న వారికి సైతం నోటీసులు నేరుగాగానీ.. వాట్సాప్ ద్వారాగానీ అందజేసి తగిన రసీదు పొందాలన్నారు. రీ సర్వే చేసే గ్రామంలో విస్తీర్ణాన్ని బట్టి 4 నుంచి 5 బృందాలను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఒక్కో బృందంలో ఇద్దరు గ్రామ సర్వేయర్లు, ఒక వీఆర్‌ఓ, ఒక గ్రామ రెవెన్యూ సహాయకుడు ఉంటారన్నారు. రీ సర్వేపై అవగాహన సభలు నిర్వహించడం, సంబంధిత గ్రామాల్లో ప్రత్యేకంగా ప్రచార కార్యక్రమాలు నిర్వహించడం చేయాలన్నారు. ప్రతి రైతుకు ఎల్‌పీఎం వచ్చేలా రోవర్ ద్వారా సర్వే చేయాలన్నారు. రెవెన్యూ రికార్డుల్లో సవరణలు, ఎవరైనా మరణించి ఉంటే వారి పేరు తొలగించడం, మ్యుటేషన్ వంటివి నిర్వహించి ఎటువంటి పొరపాట్లకు తావు లేకుండా పనిచేయాలన్నారు. సమావేశంలో జిల్లా సర్వే అధికారి గౌస్‌బాషా, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే, డివిజన్ల డిప్యూటీ ఇన్‌స్పెక్టర్లు, సర్వేయర్లు, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.



రీ సర్వేపై సమావేశం నిర్వహిస్తున్న జేసీ గోపాలకృష్ణ

21న జిల్లా స్థాయి రంగోత్సవ్ పోటీలు

ఒంగోలు సిటీ: రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాల మేరకు ఈ నెల 21వ తేదీ ఉదయం 9 గంటలకు మైనంపాడు ప్రభుత్వ డైట్ కళాశాలలో జిల్లాస్థాయి రంగోత్సవ్ పోటీలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ సామా సుబ్బారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఎనిమిది అంశాలలో పోటీలు జరుగుతాయన్నారు. పంజాబ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చరిత్ర, సంస్కృతి, భూగోళ శాస్త్రంపై క్విజ్ పోటీలు ఉంటాయన్నారు. భారత స్వాతంత్ర్య సమరయోధుల చిత్రపటాలు గీయడంపై డ్రాయింగ్ పోటీలు, ఒక పేరా తెలుగు, ఇంగ్లిష్‌పై చేతిరాత పోటీలు, 8 నుంచి ఇంటర్ వరకు చదివే ఐదుగురు విద్యార్థుల గ్రూప్‌లకు రంగోలి పోటీలు, పంజాబ్, ఆంధ్రప్రదేశ్ జానపద నృత్యాలు, జాతీయ సమైక్యతపై డిజిటల్ పోస్టర్ల తయారీ, ఏక్ భారత్, శ్రేష్ఠ భారత్‌పై స్లోగన్ తయారీ పోటీలు, భారతీయ సంస్కృతి, చరిత్ర, విలువలపై రోల్ ప్లే పోటీలు ఉంటాయని వివరించారు. అన్ని ప్రభుత్వ, జెడ్పీ, మున్సిపల్, ఎయిడెడ్, కేంద్రీయ, ప్రైవేట్ పాఠశాలల్లో 6 నుంచి 12వ తరగతి విద్యార్థులు అర్హులన్నారు. ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి, జాతీయ స్థాయి పోటీలకు వెళ్లే అవకాశం ఉందన్నారు. వివరాలకు 95020 43307 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

క్లుప్తంగా

మనోవేదనతో ఉరేసుకుని మహిళ మృతి

కనిగిరి రూరల్: క్యాన్సర్‌తో బాధపడుతున్న ఓ మహిళ జీవితంపై విరక్తి చెంది చీరతో ఉరేసుకుని మృతి చెందింది. ఈ సంఘటన శుక్రవారం కనిగిరి పట్టణంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. కనిగిరి అర్బన్ కాలనీలో నివాసం ఉంటున్న బత్తుల అనంతమ్మ(55) గత మూడేళ్ల నుంచి క్యాన్సర్ వ్యాధితో బాధపడతూ చికిత్స పొందుతోంది. ఈ క్రమంలో తీవ్ర మానసిక వేదనకు గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉదయం 7 గంటలకు చీరతో ఉరేసుకుంది. ఆమె కుమారుడు బి.అజయ్ గమనించి హుటాహుటిన స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లాడు. వైద్యులు పరీక్షించి అప్పటికే అనంతమ్మ మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌ఓ రవికుమార్ తెలిపారు.

బైకులు ఢీకొని ఒకరు మృతి


ప్రతాప్(ఫైల్)

నాగులుప్పలపాడు: బైక్‌పై వెళ్తున్న వ్యక్తులు ఒక్కసారిగా మలుపు తిరుగుతుండగా వెనుకనే వస్తున్న మరో మోటారుసైకిల్ ఢీకొట్టిన ప్రమాదంలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన నాగులుప్పలపాడు మండలంలోని చదలవాడ కాలనీ సమీపంలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్సై శ్రీకాంత్ కథనం మేరకు.. నాగులుప్పలపాడు నుంచి ఒంగోలు వైపు రెండు మోటారు సైకిళ్లు వెళ్తున్నాయి. ఈ క్రమంలో చదలవాడ కాలనీలోకి వెళ్లడానికి ముందు వెళ్తున్న బైక్ సిగ్నల్ వేయకుండా ఒక్కసారిగా మలుపు తీసుకోవడంతో వెనుకనే వస్తున్న మోటార్ సైకిల్ వేగం అదుపుకాక ఢీకొట్టింది. వెనక మోటార్ సైకిల్‌పై కూర్చున్న అల్లంనేని ప్రతాప్ (57) కిందపడిపోయాడు. ఈ ప్రమాదంలో ప్రతాప్ తలకు బలమైన గాయం తగలడంతో అక్కడికక్కడే మృతి చెందారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

ఉత్సాహంగా ఎడ్ల బల ప్రదర్శన పోటీలు

కురిచేడు: మండలంలోని పొట్లపాడు గ్రామంలో గుత్తికొండ రామయోగి తాత 114వ ఆరాధన ఉత్సవాల సందర్భంగా శుక్రవారం రాష్ట్ర స్థాయి ఎడ్ల బల ప్రదర్శన పోటీలు ఉత్సాహభరిత వాతావరణంలో సాగాయి. తొలిరోజు న్యూ కేటగిరీ విభాగంలో 9 జతల ఎడ్లు పాల్గొన్నాయి. శనివారం 6 పళ్ల సైజు విభాగంలో పోటీలు నిర్వహించనున్నారు. న్యాయనిర్ణేతలుగా దుర్గి శ్రీను, రెంటాల సుబ్బారెడ్డి, అక్కపల్లి వెంకటరామిరెడ్డి వ్యవహరిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ చమిడిశెట్టి శ్రీను తెలిపారు. పోటీలు నిర్వహించేందుకు సహకరించిన దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.


బండ లాగుతున్న ఎడ్ల జత

ఐఆర్ ఇవ్వకుంటే ఉద్యమమే..

- పెండింగ్ బకాయిలు రూ.36 వేల కోట్లు..
- రూ.6 వేల కోట్లు ఇచ్చి అన్నీ చేసేశామని చెప్పడం సరికాదు
- ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలపై ప్రభుత్వం మౌనం వీడాలి
- మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి, ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రఘునాథరెడ్డి ధ్వజం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి

పామూరు: ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలపై ప్రభుత్వం మౌనం వీడి వెంటనే 30 శాతం మధ్యంతర భృతి(ఐఆర్) ప్రకటించకపోతే ఉద్యమం తప్పదని మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి, ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఒమేగా కళాశాలలో ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు కె.ఎర్రయ్య అధ్యక్షతన ఉపాధ్యాయ ఉద్యమ శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 11వ వేతన సవరణ గడువు ముగిసి 18 మాసాలు గడుస్తున్నా ఇంతవరకు 12వ వేతన సవరణ ఊసేలేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఉద్యోగుల గోడు వినే అవకాశం ఇవ్వకుండా కాలయాపన చేయడం ఎంత వరకు సమంజసమన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చి అధికాంలోకి వచ్చి 7 మాసాలు కావస్తున్నా ప్రభుత్వం నోరుమెదపకపోవడం అన్యాయమన్నారు. రావాల్సిన బకాయిల్లో కేవలం 10 శాతం మాత్రమే విడుదలచేసి మొత్తం బకాయిలు విడుదల చేసినట్లు చెప్పుకోవడం సరికాదన్నారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులకు చెల్లించాల్సిన పీఆర్సీ, డీఏ బకాయిలు, జెడ్పీపీఎఫ్, ఏపీజీఎల్ఐ లోన్లు, ఫైనల్ పేమెంట్లు, సరెండర్ లీవ్ బిల్లులు అన్నీ కలిపి సుమారు రు.36 వేల కోట్ల బకాయిలు పెండింగ్‌లో ఉంటే కేవలం రు.6 వేల కోట్లు విడుదల చేయడాన్ని ఆక్షేపించారు. సీపీఎస్ లాంటి ప్రధాన హామీలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని దుయ్యబట్టారు. పెండింగ్ బకాయిలు రు.30 వేల కోట్లతోపాటు తక్షణం 30 శాతం ఐఆర్ ప్రకటించకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా కార్యదర్శి వై.రామచంద్రారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రమణారెడ్డి, బి.వెంగళరెడ్డి, చల్లా శ్రీనివాసులు, జి.నాగేంద్రకుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి నరసింహారెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్లు బీసీహెచ్.వెంకటేశ్వర్లు, జిల్లా కార్యవర్గ సభ్యులు నాగయ్య, నర్రా కోటేశ్వరరావు, మౌలాలి, రామచంద్రారెడ్డి, సుధాకర్ ఎస్టీయూ సభ్యులు పాల్గొన్నారు.

యువకుడు అనుమానాస్పద మృతి


యశ్వంత్ మృతదేహం వద్ద విలపిస్తున్న తల్లిదండ్రులు


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై శివ

- ప్రేమించిన యువతి ఇంటిపైనే విగతజీవిగా..
- మృతదేహం పక్కనే పురుగుల మందు డబ్బా
- ఆత్మహత్య కాదు చంపేశారని కుటుంబ సభ్యుల రోదన
- అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసిన పోలీసులు

కురిచేడు: తిరునాళ్లకు వెళ్లి వస్తానని కుటుంబ సభ్యులకు చెప్పి బయలుదేరిన యువకుడు కురిచేడులో తాను ప్రేమించిన యువతి ఇంటిపై అనుమానాస్పద స్థితిలో విగత జీవిగా పడి ఉన్నాడు. ఈ సంఘటన గురువారం రాత్రి చోటుచేసుకోగా శుక్రవారం తెల్లవారుజామున వెలుగుచూసింది. అందిన సమాచారం ప్రకారం.. కురిచేడు మండలంలోని ఎన్ఎస్‌పి అగ్రహారం గ్రామానికి చెందిన పాణ్యం యశ్వంత్(25) గురువారం రాత్రి పొట్లపాడు తిరునాళ్లకు వెళ్లి వస్తానని ఇంటి వద్ద చెప్పి బయలుదేరాడు. శుక్రవారం ఉదయం కురిచేడులోని వినుకొండ రోడ్డులో యూనియన్ బ్యాంకు సమీపంలో ఓ ఇంటిపై అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. యశ్వంత్ మృతిపై భిన్న కథనాలు వినిపిస్తున్నాయి. యశ్వంత్ ఐదేళ్ల క్రితం కురిచేడులోని ఓ బట్టలషాపులో గుమస్తాగా చేరాడు. ఆ సమయంలో ఎదురు దుకాణంలో గుమస్తాగా పనిచేస్తున్న ఓ యువతిని ప్రేమించాడు. యశ్వంత్ గుమస్తాగా మానేసి పొలం పనులు చేస్తూనే ఆ యువతితో స్నేహంగా ఉంటున్నాడు. అయితే ఆ యువతికి ఇటీవల వివాహమైంది. పండగ నేపథ్యంలో పుట్టింటికి వచ్చిన ఆ యువతితో గురువారం రాత్రి ఫోన్‌లో మాట్లాడుకున్నట్లు మృతుడి సెల్‌ఫోన్‌లో రికార్డు అయి ఉంది. తెల్లవారే సరికి యువతి ఇంటిపై యశ్వంత్ చనిపోయి ఉండటం పలు అనుమానాలకు తావిస్తోంది. యువతి ప్రేమ దక్కలేదని, మరొకరిని వివాహం చేసుకుని వెళ్లినందుకు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడనే కథనం వినిపిస్తోంది. మృతదేహం పక్కన పురుగుల మందు డబ్బా ఉండటంతో ఆత్మహత్యగా పలువురు అనుమానిస్తున్నారు. కానీ యశ్వంత్ మృతదేహాన్ని చూసిన తల్లిదండ్రులు ఎవరో చంపి ఇక్కడ పడేశారని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పురుగుల మందు తాగి ఉంటే మృతదేహం వద్ద వాసన, నోటి వెంట నురుగు వస్తాయని, ఆ ఆనవాళ్లు ఏమీ లేవని, తమ కొడుకును హత్య చేశారంటూ బోరున విలపిస్తున్నారు. యశ్వంత్ మృతి వార్త తెలియగానే గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.శివ తెలిపారు. దర్శి ప్రభుత్వ వైద్యశాలలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

కులం తక్కువోళ్లను పనిలో పెట్టుకోవడమే గొప్ప

- దళిత మహిళలనుద్దేశించి టీడీపీ నాయకురాలు అరికట్ల సుమతి వివాదాస్పద వ్యాఖ్యలు
- అధికారంలో ఉన్నాం.. ఎక్కువ మాట్లాడితే కేసులు పెట్టి జైలుకు పంపుతామంటూ బెదిరింపులు
- దళిత మహిళపై కౌంటర్ కేసు పెట్టి వేధింపులు
- సుమతిని అరెస్టు చేయాలని మాలమహానాడు డిమాండ్


విచారణ నిర్వహిస్తున్న ఎస్టీ డీఎస్పీ శరత్‌బాబుకు వినతిపత్రం అందజేస్తున్న దళిత నాయకులు

ఒంగోలు టౌన్: 'కులం తక్కువ వారిని పనిలో పెట్టుకోవడమే గొప్ప.. మళ్లీ వారికి బోనస్ కూడా ఇవ్వాలా..? ఈ ప్రభుత్వం మాది.. ఎక్కువగా మాట్లాడితే కేసు పెట్టి జైలుకు పంపిస్తా' అంటూ ఒంగోలు నగరానికి చెందిన టీడీపీ నాయకురాలు ఆరికట్ల సుమతి తన దుకాణంలో పనిచేసే దళిత మహిళలను కులం పేరుతో దూషించడమే కాకుండా బెదిరించినట్లు స్థానిక వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో గతేడాది డిసెంబర్ 26వ తేదీ ఇచ్చిన ఫిర్యాదుపై శుక్రవారం ఎస్సీ డీఎస్పీ ఎస్.శరత్ విచారణ నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ నాయకురాలైన అరికట్ల సుమతి మంగమూరు రోడ్డులోని గాయత్రి మందిరం వద్ద పెరల్స్ డ్రెస్సెస్ అండ్ బ్యూటీ పార్లర్ నిర్వహిస్తున్నారు. అందులో దళిత మహిళలైన మట్టిగుంట శ్రీకన్య, కొట్టు కౌసల్య పనిచేస్తున్నారు. వారికి వేతనంతో పాటుగా బోనస్ తాలూకు ఒక్కొక్కరికి 15 వేల చొప్పున ఇవ్వవలసి ఉంది. ఈ డబ్బు విషయంలో వారి మధ్య మనస్పర్థలు చోటుచేసుకున్నాయి. దాంతో దుకాణ యజమానురాలైన టీడీపీ నాయకురాలు సుమతి తన వద్ద పనిచేస్తున్న శ్రీకన్య, కౌసల్యలను కులం పేరుతో దూషించారు. మిమ్మల్ని పనిలో పెట్టుకోవడమే కాకుండా బోనస్ కూడా ఇవ్వాలా అంటూ ఎద్దేవా చేశారు. 'ఈ ప్రభుత్వం మాది, నాకు ఎస్పీ తెలుసు, ఎమ్మెల్యేలు తెలుసు, మీరు నన్నేం చేయలేరు' అంటూ నిర్లక్ష్యంగా జవాబు ఇచ్చారు. వేతనం అడిగినందుకు ఉంగరం దొంగలించారని అపనింద వేశారు. దాంతో బాధితులు ఒంగోలు వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు. దీంతో రెచ్చిపోయిన సుమతి తనను బెదిరిస్తూ ఫోన్‌లో మెసేజ్‌లు పెట్టారంటూ అధికార పార్టీ అండదండలతో ఒంగోలు తాలూకా పోలీసు స్టేషన్‌లో బాధితురాలైన శ్రీకన్య, ఆమె భర్త శ్రీహరితో పాటుగా మరి కొందరిపై కౌంటర్ కేసు పెట్టారు. ఈ కేసులపై ఒంగోలు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ సీఐ నాగరాజుతో కలిసి ఎస్సీ డీఎస్పీ ఎస్.శరత్‌బాబు శుక్రవారం విచారణ ప్రారంభించారు. మంగమూరు రోడ్డులోని పెరల్స్ డ్రెస్సెస్ వద్దకు స్వయంగా వెళ్లి వివరాలు సేకరించారు. ప్రస్తుతం విచారణ జరుగుతోందని, ఇంకా సాక్షులను కూడా విచారించాల్సి ఉందని తెలిపారు.

సుమతిని అరెస్టు చేయాలి

దళిత మహిళలను కులం పేరుతో దూషించడమే కాకుండా బెదిరింపులకు పాల్పడిన టీడీపీ నాయకురాలు అరికట్ల సుమతిని వెంటనే అరెస్టు చేయాలని మాల మహానాడు జిల్లా ప్రధాన కార్యదర్శి కాకుమాను రవి విజ్ఞప్తి చేశారు. ఎస్సీ, ఎస్టీ కేసులో ఫిర్యాదుదారులైన శ్రీకన్య, ఆమె భర్త శ్రీహరిపై పెట్టిన కౌంటర్ కేసులను ఎత్తి వేయాలని డిమాండ్ చేశారు. దళిత హక్కుల పరిరక్షణ సమితి నాయకుడు నీలం నాగేంద్రరావుతో కలిసి డీఎస్పీ శరత్‌బాబుకు వినతి పత్రం అందజేశారు.

మద్యం పీడ వదిలించండమ్మా..


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆవులమంద గ్రామస్తులు

- తహసీల్దార్‌కు ఆవులమంద గ్రామస్తుల మొర

కురిచేడు: 'మేడం మా ఊరిలో చాలా మంది అక్రమంగా మద్యం అమ్ముతున్నారు. బెల్ట్ షాపుల వల్ల మా కుటుంబాలు వీధిన పడుతున్నాయి. మా భర్తలతోపాటు పిల్లలు కూడా మద్యం తాగి షాపుల వద్ద, రోడ్ల వెంట పడిపోతున్నారు. అప్పులపాలవుతున్నాం. మందు పీడ నుంచి మమ్మల్ని కాపాడండి' అంటూ తహసీల్దార్ రజనీకుమారికి కురిచేడు మండలం ఆవులమంద గ్రామస్తులు మొరపెట్టుకున్నారు. శుక్రవారం ఆవులమంద గ్రామానికి చెందిన మహిళలు, పురుషులు సుమారు 100 మంది రెవెన్యూ కార్యాలయానికి చేరుకుని గోడు వెళ్లబోసుకున్నారు. గ్రామంలో బెల్టుషాపులు నిర్వహించే వారి పేర్లను సైతం లిఖితపూర్వకంగా రాసి ఇచ్చారు. అనంతరం గ్రామస్తులు మాట్లాడుతూ.. మద్యం సీసాలతో తమ గ్రామానికి ఎవరు వచ్చినా బహిరంగంగా చితకబాది పోలీసులకు అప్పగిస్తామని హెచ్చరించారు. తహసీల్దార్‌కు గ్రామస్తుల ఫిర్యాదు నేపథ్యంలో దర్శి ఎక్సైజ్ సిఐ కే శ్రీనివాసరావు తమ సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. ఎక్కడా అక్రమ మద్యం దొరకలేదని ఎక్సైజ్ అధికారులు చెప్పడం కొసమెరుపు. దాడులలో ఎక్సైజ్ ఎస్సై రఘు సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.


ఆవులమందలో తనిఖీ చేస్తున్న ఎక్సైజ్ పోలీసులు

రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య!

మార్కాపురం: మార్కాపురం రైల్వేస్టేషన్ సమీపంలోని ఫ్లయ్ ఓవర్ బ్రిడ్జి వద్ద శుక్రవారం ఉదయం పెద్దారవీడు మండలం గొబ్బూరు గ్రామానికి చెందిన వెన్న తిమ్మారెడ్డి(35) రైలు కింద పడి మృతి చెందినట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ హరికృష్ణారెడ్డి తెలిపారు. గొబ్బూరుకు చెందిన నారాయణరెడ్డి కుమారుడు తిమ్మారెడ్డి ఇంజినీరింగ్ విద్య పూర్తి చేశాడు. పొరపాటున పడ్డాడా.. ఆత్మహత్యకు పాల్పడ్డాడా.. అనే అంశంపై దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు. సమాచారాన్ని కుటుంబ సభ్యులకు తెలియజేశామని చెప్పారు.


మృతి చెందిన తిమ్మారెడ్డి

మూడు జిల్లాల క్రికెట్ టోర్నీ విజేత 'సీఎస్‌పురం' జట్టు


విజేతలకు బహుమతి అందజేస్తున్న దాతలు

సీఎస్‌పురం(పామూరు): సంక్రాంతి సందర్భంగా ప్రకాశం, నెల్లూరు, వైఎస్సార్ జిల్లాల స్థాయిలో మండల కేంద్రమైన సీఎస్‌పురం జెడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కేఎస్ రాయల్, ఎస్‌పీ ప్రసాద్ క్రికెట్ టోర్నీలో సీఎస్‌పురానికి చెందిన మధు, మహి జట్టు విజేతగా నిలిచింది. శుక్రవారం సాయంత్రం బహుమతి ప్రదాన కార్యక్రమంలో ఎస్సై ఆర్.సుమన్, సింగిల్ విండో మాజీ చైర్మన్ బోయళ్ల నారాయణరెడ్డి మాట్లాడుతూ.. క్రీడలు ఐక్యతను, పోటీతత్వాన్ని పెంపొందిస్తాయన్నారు. విద్యతోపాటు క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. విజేతగా నిలిచిన మధు, మహి జట్టుకు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నాయకుడు కదిరి బాబూరావు సమకూర్చిన రు.50,116, రన్నర్స్‌గా నిలిచిన బేస్తవారిపేట మండలం శింగరపల్లి జట్టుకు సింగిల్ విండో మాజీ చైర్మన్ బోయళ్ల నారాయణరెడ్డి రూ.30 వేలు, తృతీయ, చతుర్థ స్థానాల్లో నిలిచిన సీఎస్‌పురం టౌన్, ఏనుగడ్డ జట్లకు నాయకులు బొబ్బూరి రమేష్ రూ.20 వేలు, ఎంపీటీసీ మన్నేపల్లి పెద్దన్న రూ.10 వేలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీరామ పద్మావతి, మన్నేపల్లి శ్రీనివాసులు, బొబ్బూరి రమేష్, తోట అశోక్, సంగిశెట్టి శ్రీను, మారెళ్ల రవి, ఎస్.ఎస్.వాసు, బోయిన రాయుడు, మన్నేపల్లి నాగార్జున, షేక్.రజ్జబ్‌బాషా, సంగిశెట్టి పీరయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ విజిలెన్స్ అధికారుల దాడులు

- 117 మందికి రూ.11 లక్షల జరిమానా

కొమరోలు: మండలంలో విద్యుత్ విజిలెన్స్ అధికారులు శుక్రవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. అక్రమ విద్యుత్ చౌర్యం చేస్తున్న 117 సర్వీసులకు రూ.11.06 లక్షల అపరాధ రుసుం విధించినట్లుగా మార్కాపురం డివిజన్ విద్యుత్ ఈఈ బి.వి.నాగేశ్వరరావు తెలిపారు. దాడుల అనంతరం కొమరోలులోని విద్యుత్ సబ్ స్టేషన్‌లో విలేకర్లతో మాట్లాడారు. మార్కాపురం డివిజన్‌లోని 152 మంది విద్యుత్‌శాఖ అధికారులు, సిబ్బంది 56 బృందాలుగా ఏర్పడి 1721 సర్వీసులను తనిఖీ చేసినట్లు వివరించారు. మీటర్ లేకుండా విద్యుత్ వినియోగిస్తున్న 18 సర్వీసులకు రూ.1.89 లక్షలు, మీటరు ఉన్నప్పటికీ అక్రమంగా విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న 21 సర్వీసులకు రూ.2.81 లక్షలు, అనుమతించిన కేటగిరీ కాకుండా ఇతర కేటగిరీల ద్వారా చౌర్యానికి పాల్పడిన 2 సర్వీసులకు రూ.8 వేలు, అదనపు లోడు వినియోగిస్తున్న 86 సర్వీసులకు రూ.6.28 లక్షలు జరిమానా విధించినట్లు వెల్లడించారు. దాడుల్లో మార్కాపురం ఏడీఈ బి.వి.శేషగిరిరావు, డీపీఈ-ఈఈ హైమవతి, గిద్దలూరు డీఈ వెంకటేశ్వరరావు, కొమరోలు ఏఈ శ్రీనివాసులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న విద్యుత్‌శాఖ ఈఈ నాగేశ్వరరావు